గురువు అంటే కేవలం భౌతికశరీరం కాదు. గురువు యొక్క శరీరం పోయినా ఆయన అనుగ్రహం పనిచేస్తూనే ఉంటుంది. మన శరీరం పోయినప్పుడు బాహ్యమైన సంబంధాలు అన్నీ తెగిపోతాయి కాని గురువుతో ఉన్న సంబంధం తెగదు. నువ్వు ఏ శరీరంలో ఉన్నా నీ అడ్రసు తెలుసుకొని నిన్ను వెంటాడి వెంటాడి చైతన్యం తాలుక ఎరుక నీకు కలిగేవరకూ గురువు అనుగ్రహం నిన్ను విడిచిపెట్టదు. అట్టిది గురువు అనుగ్రహం దానికి కారణాలు అక్కరలేదు. నేను, నాది అనే తలంపులు అవి నిన్ను విడిచిపెట్టాలి కాని నువ్వు వాటిని విడిచిపెట్టలేవు. నువ్వు సత్యాన్వేషణలో ఉన్నప్పుడు, సత్యం యొక్క సన్నిధిలోనికి నువ్వు జారుకున్నప్పుడు మాత్రమే ఈ నేను, నాది అనే తలంపులు కనబడకుండా పోతాయి. ఈశ్వరానుగ్రహం పొందటానికి మనం ప్రయత్నం చేయాలి. ఆయన అనుగ్రహం లేకుండా మనం ఏమీ చేయలేము. అదే నిజమైన సంపద. ఆచార్యులవారు ఒకసారి ఏమన్నారు అంటే సత్యానుభవం పొందాక నీ పాతఅలవాట్లను రమ్మన్నా అవి తిరిగిరావు. మన అలవాట్లు అన్నీ ఏమైపోయాయి అని వెదికినా అవి మీకు కనబడవు. సత్యసాక్షాత్కారం యొక్క వైభవం అది. నిప్పులో పడిన ఈగలు, దోమలు బతకగలవా? సత్యసాక్షాత్కారం అయిన తరువాత నీ పాతఅలవాట్లు కూడా నిప్పులో పడిన ఈగలు, దోమలవంటివే. అవి కాలి బూడిద అయిపోతాయి. శివుడే మొదటి ఆచార్యుడు, మొదటి గురువు. ఆయన అనుగ్రహస్వరూపుడు. అనేకమంది దేవతలు అనేకమంది కోరికలు నెరవేర్చవచ్చు. మీకు ఏమి కావాలంటే అవి కోరుకోండి, అవి వస్తాయి, అవి ఎంతకాలం ఉంటాయి అనుభవిస్తే పోతాయి. శివానుగ్రహం లేకుండా అద్వైతానుభవం కలుగదు అని ఆచార్యులవారు చెప్పారు. అలాగని ఆయనకు శివకేశవ బేధం లేదు. మరి అలా ఎందుకు ఆయన చెప్పాడో, అదే నేను ఈ శివరాత్రి రోజున మీకు రిపీటెడ్‌గా చెపుతున్నాను.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 09-05-2011, గుండుగొలను)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మనిషికి మాటలోకాని, చేతలోకాని, ఆలోచనలోకాని తొందరపాటు పనికిరాదు. శాంతచిత్తం అవసరం. మనం శరీరానికి ఎక్కువ ప్రాముఖ్యత ఇస్తున్నాము. కాని శరీరానికి ఎంతవరకు ప్రాముఖ్యత ఇవ్వాలి అంటే జ్ఞానసముపార్జనకి ఉపయోగపడేలాగ ఉంటే సరిపోతుంది. దైవీసంపద పెంచుకుంటూ రావాలి. దైవీసంపద పెంచుకోవటం వలన ఆత్మజ్ఞాన సంపాదనకు అర్హత కలుగుతుంది. రాగ దోషము, ద్వేష దోషము ఈ రెండూ

పెద్ద దోషాలు అని, ఈ రెండింటి గురించి బుద్ధుడు జీవితం పొడుగునా చెప్పాడు. నువ్వు లోపలకు వెళ్ళే ప్రయత్నం చేసుకో, లోపలకి వెళ్ళి లోపలఉన్న సద్వస్తువు తాలుకా అనుభవాన్ని పొందు. బయట ఏముంది? ఏ దేశానికి వెళ్ళినా, ఏ ప్రాంతానికి వెళ్ళినా, ఏ కుటుంబంలో చూచినా ఏముందీ లోకంలో రాగద్వేషాలు తప్పించి బయట ఎక్కడా ఏమీలేదు అని బుద్ధుడు చెప్పాడు. మనం ఈ శరీరంలో ఉండగానే నూటికి నూరుపాళ్ళు ఆనందముగా, శాంతిగా, సుఖంగా ఉండగలిగితే శరీరం పోయిన తరువాత కూడా ఈ శాంతి, ఆనందం కంటిన్యూ అవుతుంది. మన శరీరం ఉండగా ఆనందాన్ని సంపాదించలేకపోతే శరీరం చనిపోయిన తరువాత అశాంతి కంటిన్యూ అయిపోతుంది. ఇది గుర్తుపెట్టుకోండి. మీకు అవసరం లేని విషయాలకు వెళ్ళకండి. టైముని మీరు సద్వినియోగం చేసుకోండి. మీ శరీరం ఉండగానే, మీరు సంసారం మధ్యలో ఉండగానే, ఈ ప్రపంచం మధ్యలో ఉండగానే రాగద్వేషాల యొక్క వేగం తగ్గించుకోండి. ఇప్పుడు మీరు రాగద్వేషాలు తగ్గించుకోలేకపోయినా, మీ శరీరాన్ని జీవుడు విడిచిపెట్టి బయటికి వెళ్ళే రోజుకైనా రాగద్వేషాలు తగ్గించుకోండి. రాగద్వేషాలు తగ్గించుకుంటే మీ శరీరం పోయిన తరువాత కూడా శాంతి కంటిన్యూ అవుతుంది. ఓరామా, శ్రీరామా శాంతిలేని వాడికి సుఖం ఎక్కడ ఉంది, శాంతిలేనివాడికి ఆనందం ఎక్కడ ఉంది అని త్యాగరాజు తనకీర్తనలో పాడాడు. నాకు ధనం ఉంది, చదువు ఉంది నాకు ఆనందం అక్కరలేదు, శాంతి అక్కరలేదు అనేవాడు ఈ సృష్టిలో ఒక్కడు కూడా ఉండడు. ప్రతీ మనిషికి ఆనందం కావాలి. ఆనందం కావాలి అంటే శాంతి ఉండాలి. అయితే మనం శాంతిగా ఎందుకు ఉండలేకపోతున్నాము. దానికి తలంపులే కారణం. మంచితలంపులు అవ్వవచ్చు, చెడ్డతలంపులు అవ్వవచ్చు. ఏదో తలంపు వచ్చి మన శాంతిని చెడగొడుతున్నాయి. ఆ తలంపులు ఎక్కడ నుండి వస్తున్నాయి అంటే మనస్సులోంచే వస్తున్నాయి. దేహము నేను అనే తలంపు, దానికి వచ్చే ఇతర తలంపులని కలిపి మనస్సు అని పేరుపెట్టారు. ఆ మనస్సుని పవిత్రం చేసుకోవటమే, ఆ మనస్సుని ఏకాగ్రం చేసుకోవటమే, ఆ మనస్సుని నువ్వు సూక్ష్మం చేసుకోవటమే నీ సాధన యొక్క గమ్యం.

రోగభూయిష్టమైన, మలభూయిష్టమైన, ఇవాళ పచ్చగాఉండి, రేపు ఎండిపోయే ఈ శరీరం మీద మీరు మోహం తగ్గించుకోకపోతే మీకు జ్ఞానమా అన్నారు ఆచార్యులవారు. ఈ దేహమే సత్యము, ఈ దేహమే నిత్యము, దేహమే సర్వస్వం, ఈ దేహం తప్పించి ఇంక ఏమీ లేదు అని అనుకునేవాళ్ళకి ఆత్మజ్ఞానం వచ్చే అవకాశం లేదు. ఆత్మజ్ఞానం సంపాదించేవరకూ నీకు ఆనందము లేదు. నీ హృదయంలో ఉన్న ఆనందం నువ్వు

అనుభవైకవేద్యం చేసుకునే వరకూ జన్మలు తప్పవు. నీ శరీరం చనిపోయాక ఇతర లోకాలకి వెళ్ళటం తప్పదు. మీ రోజులు బాగా వెళ్ళిపోతున్నా స్వప్న సమానం, మీ రోజులు కష్టంగా వెళ్ళినా అదీ స్వప్న సమానమే ఇవన్నీ వ్యవహారికసత్యాలేకాని పారమార్థికసత్యం కాదు. మన మనస్సులో దోషాలు ఉన్నప్పటికీ మన మనస్సు ఏమని చెబుతుంది అంటే నువ్వు చాలా మంచిదానివి అని చెబుతుంది. అందుచేత మన మనస్సే మనల్ని మాయ చేస్తోంది. ఉన్న వస్తువు ఉన్నట్లుగా, లేని వస్తువు లేనట్లుగా మనకి వ్యక్తం కాకపోవటానికి కారణం మన మనస్సు, మన ఇంద్రియాలు అంతేకాని ఇంక బయట ఏ కారణాలు లేవు. ఉన్న వస్తువు ఉన్నట్లుగా మనకు గుర్తింపు వచ్చేవరకూ లేని వస్తువు లేనట్లుగా మనకు తెలియదు. రాముడి హృదయంలో ఏది ఉందో, వశిష్ఠుడు హృదయంలో ఏది ఉందో మన హృదయంలో కూడా అదే ఉంది. ఒకసారి యోగి రామయ్య గారిని మహాత్మగాంధీగారు అడిగారు. నారాయణుడు అందరి హృదయాలలో సమానంగా ఉన్నాడు. అయితే రమణమహర్షిగారికి మనకీ తేడా ఎక్కడ ఉంది అని గాంధీగారు అడిగారు. ఆయన హృదయంలో ఏమి ఉందో ఆయనకి తెలుసు, మన హృదయంలో ఏమి ఉందో మనకు తెలియదు. తెలిస్తే సుఖి, తెలియకపోతే దుఃఖం. తెలియటం, తెలియకపోవటం ఆ ఒక్కటే తేడాకాని వస్తువు అందరిలోను సమానంగానే ఉంది అని యోగిరామయ్యగారు చెప్పారు. లోపలఉన్న సద్వస్తువు యొక్క అనుభవం మనకి కలిగే వరకూ ప్రతీ జీవుడినీ భయం వెంటాడుతుంది. సంసారం ఎలా నడుస్తుంది అనే భయం, చనిపోయేటప్పుడు ఎన్ని బాధలు పడాలో అని భయం, పిల్లల జీవితాలు ఎలా ఉంటాయో అని భయం. ఇలా మునిమనవలు దాకా మీరు ఆలోచించటం. ఇదే మాయ. మీరు ఆలోచించినట్టు వారు ఉంటారా? మన దేహానికి ఎలాగ ప్రారబ్దం ఉందో అలాగే వారి దేహప్రారబ్దాలని బట్టి వారు ఉంటారు. మీరు అనుకున్నట్లుగా వారు ఉంటారని ఎప్పుడూ అనుకోవద్దు. ఒక చిన్న విషయం మీకు అర్థం అయితే మీకు ఇంక భయం లేదు, దుఃఖం లేదు. మీ ద్వారా ఏ పని జరిగినా నేను అది చేసాను, ఇది చేసాను అని ఏదో అనుకుంటూ ఉంటారు. దేనికీ మీరు కర్త కాదు. భగవంతుడు మీ శరీరాన్ని ఉపయోగించుకుంటున్నాడు. కర్త ఈశ్వరుడు అని మీకు అర్థం అయితే ఇంక దుఃఖం లేదు. కానీ అన్నింటికి నేనే కర్తని అని అనుకుంటున్నారు ఇదే మాయ.

రమణమహర్షిగారి సిద్ధాంతం జపం చేయమని, ధ్యానం చేయమని కాదు, చెయ్యవద్దని కాదు, అసలు మనస్సు అనేది ఉందో లేదో ముందు నువ్వు వెతుకు అన్నారు. మనస్సు అనేది ఉందో లేదో దానిని విచారణ చెయ్యి, దానిని విచారణ చేస్తే లేని మనస్సు

లేనట్టుగా తెలుస్తుంది. అప్పుడు నీకు సాధన చేసేవాడు అంటూ ఎవడూ మిగలడు. మనస్సు ఉందని నీకు స్థిరపడిపోతే అప్పుడు జపం చెయ్యి, ధ్యానం చెయ్యి. కొంతమంది మేము ఖర్మ అనుభవిస్తున్నాము అంటారు లేకపోతే మా రోజులు బాగా వెళ్ళిపోతున్నాయి అంటారు. ఈ ఖర్మలు, పునర్జన్మలు ఇవి అన్నీ మనస్సుకీ, శరీరానికే. లోపల ఉన్న సద్వస్తువుకి ఏమీ సంబంధం లేదు. బ్రహ్మంకి పుట్టుక లేదు, చావు లేదు. రమణసిద్ధాంతం కనుక మీకు అర్థం అయితే మీ దేహప్రారబ్ధం ఒకవేళ బాగోకపోయినా మీరు ఆనందంగా రోజులు గడిపేస్తారు. మీకు మనస్సు ఉంది అనుకుంటున్నారు కాబట్టి అందులో నుంచి విడుదల పొందటానికి ప్రయత్నం అవసరమే. మీ ప్రయత్నంతో పాటు గురువు సహాయం కూడా అవసరం. గురువు యొక్క దయ ఉంటే వాలుగాలిలో సైకిలు తొక్కితే ఎలా ఉంటుందో అలాగ మీ సాధన వేగంగా వెళు తుంది. నువ్వు భగవంతుడిని ఆరాధించగా, ఆరాధించగా నీ పుణ్య ఫలితంగానే ఆ చైతన్యమే గురు రూపం ధరించి వస్తుంది. మీ సాధనలు, మీ యాత్రలు, మీ పుణ్యాలు, మీ వ్రతాలు ఇవి అన్నీ కూడా గురువు దయ ముందు రెండో పక్షమే. అమృతత్వం పొందటానికి గురువు మార్గం కూడా చూపిస్తాడు. ఈ ఆధ్యాత్మిక మార్గంలో గురువు యొక్క ఆవశ్యకత ఎంతో ఉంది. మీకు కష్టం వచ్చినా, సుఖం వచ్చినా భగవంతుడికి తెలియకుండా రాదు. మనకి ఏది మంచిదో, మనకి ఏది చెడ్డదో గురువుకి తెలిసినట్టు మనకి తెలియదు. అందుచేత మీ ఇష్టమే నా ఇష్టం, మీ సంకల్పమే నా సంకల్పం అనుకుంటే మనకి హాయిగా, సుఖంగా, శాంతిగా జీవితం వెళ్ళిపోతుంది. నాకు ఇష్టాలు అంటూ లేవు, నీ ఇష్టమే నా ఇష్టం. నాకు సంకల్పాలు అంటూ లేవు, నీ సంకల్పమే నా సంకల్పం అని శరణాగతి చేసినా మనకి మనోనాశనం అవుతుంది.

అంతా ఈశ్వరసంకల్పంతోటి నడుస్తోంది. జరిగేది ఏదో జరుగుతుంది, జరుగరానిది ఎవరు ఎంత ప్రయత్నం చేసినా జరుగదు. ఇది నిశ్చయము అని భగవాన్ చెప్పారు. ఇది మంత్రం. మీ వివేకం ఉపయోగించి, మీ ఏకాగ్రత ఉపయోగించి, మీ పవిత్రత ఉపయోగించి, మీ వైరాగ్యం ఉపయోగించి అంతా ఈశ్వరసంకల్పంతోటి నడుస్తోంది అని మీరు తెలుసుకోవాలి. అదే మీ జీవిత గమ్యం. అది మీరు తెలుసుకుంటే సుఖపడతారు. మీకు తెలియకపోతే దుఃఖపడతారు. మీకు తెలుసున్నా, తెలియకపోయినా జరిగేది అదే. గీతలో పరమాత్మ ఏమని చెప్పాడు అంటే ఉన్నదేదో ఉంది, లేనిదేదో లేదు. ఉన్న దానికి లేకపోవటం అంటూ లేదు. లేనిదానికి ఉండటం అంటూ లేదు. ఇది సందేహరహితము. లేనిది కూడా ఉందని నువ్వు అనుకోవచ్చు, నువ్వు అనుకున్నావని అది ఉండదు. నీకు ఇష్టం ఉన్నా

లేకపోయినా జరిగేది అదే. నువ్వు దానిని అర్థం చేసుకోవాలి అవగాహన కూడా యోగంతోటి సమానం. మీకు ముఖ్యంగా వివేకం, వైరాగ్యం ఉండాలి. మీరు చేతులతోటి పని చేస్తున్నప్పటికీ మనస్సులో వైరాగ్యం ఉండాలి. మీ ఇంట్లో వాళ్ళకి మీరు డ్యూటీ చెయ్యాలి. మీ అంతరాళాల్లో వీళ్ళు మనవాళ్ళు కాదని తెలియాలి. ఆ గుర్తింపు పెట్టుకొని పనిచెయ్యండి. మరి మన వాళ్ళు కానప్పుడు వారిని మనవాళ్ళని ఎందుకు అనుకుంటున్నాము. దానికి కారణం మోహం. మనకి ఎప్పుడైనా అశాంతి, దుఃఖము వస్తోంది అంటే దానికి కారణం మోహమే. మీరు సాధన విషయంలో బహుజాగ్రత్తగా ఉండాలి. మీ దైనందిన జీవితంలో ఆలోచనలోకాని, మాటలోకాని, చేతలోకాని రూపబుద్ధి, నామబుద్ధి పెరగకుండా చూచుకోవాలి. ఆ రకంగా జీవిస్తే రూపబుద్ధీ పోతుంది, నామబుద్ధీ పోతుంది. మీరు నెమ్మదిగా నడిచినా మార్గం మాత్రం విడిచిపెట్టకండి. మీరు చేరుకోవలసిన గమ్యం మర్చిపోవద్దు.

ప్రాపంచికమైనటువంటి నామరూపాల మీద నాకు మోహం పోయింది. ఇప్పుడు నీ మోహంలో పడ్డాను. నీ మోహంలో పడటం వలన అరుణాచల, అరుణాచల అని నిన్ను నేను విడిచిపెట్టలేకపోతున్నాను అన్నారు భగవాన్. నీ మీద నేను మోహపడటం వలన లోకానికి సంబంధించిన వాసన పోయింది. కానీ నేను ఇప్పుడు అద్వైతానుభవం పొందాలి అంటే నీ మీద కూడా నాకు మోహం పోవాలి. నీమీద ఇష్టం పోవాలి అంటే నా సాధన సరిపోదు. నీ మీద ఇష్టం కూడా నువ్వే పోగొట్టు అరుణాచలేశ్వరుడా. నువ్వు వేరుగా ఉన్నావు అనుకుంటే మళ్ళీ కోరికలు అడగాలి అనిపిస్తుంది, రకరకాల తలంపులు వస్తాయి. అందుచేత నీ మీద కూడా నాకు ఇష్టం పోవాలి. అది నువ్వే చెయ్యాలి. అప్పుడు కాని నాకు అమృతానుభవం కలుగదు అని అక్షరమణమాలలో భగవాన్ చెప్పారు. మీరు సాధన ప్రారంభించినప్పుడు కొంత కష్టపడాలి. మీ మనస్సు పవిత్రమవుతున్నట్టు, మీ మనస్సు ఏకాగ్రమవుతున్నట్టు మీకు గుర్తు ఏమిటి అంటే ఈశ్వరుడిని పొందాలి, మోక్షసుఖం పొందాలి అది ఒక్కటే నా జీవిత గమ్యం, మనం పొందవలసింది అదే అని నీకు అనిపిస్తుంది. నువ్వు పవిత్రుడవు అవ్వకుండా ఈశ్వరుడిని పొందాలి అనే కాంక్ష కూడా నీకు రాదు. నువ్వు పొందుతావా లేదా అనేది వేరే విషయం. కనీసం నీకా డిజైర్ కూడా ఎరైజ్ కాదు. ఈశ్వరుడు ఏదో గురురూపంలో మీకు కనిపిస్తూ ఉంటాడు, మీతోటి మాట్లాడుతూ ఉంటాడు, మీతోటి కలిసి భోజనం చేస్తాడు కానీ వాడు ఎవడో మీకు తెలియనివ్వడు. కానీ మిమ్మల్ని ఎక్కడికి తీసుకువెళ్ళాలో ఆ గమ్యం మరచిపోడు. ఒకోసారి మీరు అనుకున్న కోరికలన్నీ నెరవేర్చేస్తూ

ఉంటాడు. ఒకోసారి ఆపుచేస్తూ ఉంటాడు. మీకు భోగాలు ఉన్నప్పడు ఎలాగ ఉన్నారో చూస్తాడు, మీకు కష్టాలు ఉన్నప్పడు ఎలాగ ఉన్నారో చూస్తాడు, రెండూ సమానంగా తీసుకోలేకపోతే ఒక ప్రక్కన పెడతాడు కాని మొత్తానికి విడిచిపెట్టేయడు. ఇది అంతా భగవంతుడు చేస్తున్నాడు అని మీకు తెలియదు. మీ పిల్లలు బాగా చదువుకుంటున్నారా అంటాడు, మీ అమ్మాయికి పెళ్లి అయిపోయిందా అంటాడు, ఇవన్నీ గురువుకి ఎందుకు? మీతోటి ఎక్కువ చనువుగా ఉండటంకోసం అలా అడుగుతూ ఉంటాడు. మీతో చనువుగా ఉండటానికి కారణం ఏమిటి అంటే మీ మనస్సుని శుద్ధి చేయటానికి తప్పించి గురువుకి ఇంకోపని లేదు. ఎందుచేతనంటే మనస్సును శుద్ధి చేయకుండా జ్ఞానం ఇస్తే మీ మనస్సు భరించలేదు. నువ్వు మొయ్యలేని బరువు నీ నెత్తిమీద పెడితే ఏమవుతుంది? కింద పడిపోతావు. అందుచేత గురువు మీకు ఎంతవరకు అర్హత ఉందో, యోగ్యత ఉందో చూచుకుంటాడు. అర్హత లేదని, యోగ్యత లేదని వీళ్ళు పనికి రారని వదిలేయడు. మీకు ఆ యోగ్యత, అర్హత వచ్చేవరకూ చేపను తోమినట్టు తోముతాడు. గురువు ఒకోసారి మీకు దూరంగా ఉన్నట్టు ఉంటాడు. గురువుకీ మనకీ సంబంధం తెగిపోయింది అని మీకు అనిపిస్తుంది. మళ్ళీ ఇంకోరోజున హృదయానికి సన్నిహితంగా వచ్చి తాకుతాడు. గురువు మనకి దూరంగా ఉన్నప్పడు ఎలాగ ఉంటున్నాము, సమీపంలో ఉన్నప్పడు ఎలాగ ఉంటున్నాము, శాంతిగా ఉన్నప్పడు ఎలాగ ఉంటున్నాము, అశాంతిగా ఉన్నప్పడు ఎలాగ ఉంటున్నాము? ఇవన్నీ చూసుకుంటూ ఉంటాడు. మీ మనస్సుకి సమానత్వం తీసుకొనివచ్చేవరకూ గురువు నిన్ను వదిలిపెట్టడు.

గురువుకి శరీరం అవసరం లేకపోయినా నీ మనస్సుని నిర్మలం చెయ్యటానికి, నీ మనస్సుని పవిత్రం చెయ్యటానికి గురువు శరీరం ధరిస్తాడు. గురువుని గురువు అనుకోవటంకంటే అనుగ్రహమే, దయే అనుకోవటం మంచిది. గురువు దయ ఒకసారి నీ శిరస్సు మీద పడితే దానిని తప్పించుకుని నువ్వు ఎక్కడకు వెళ్ళలేవు. నువ్వు ఎక్కడికి పారిపోయినా మళ్ళీ ఆ గేటు ద్వారానే నువ్వు మోక్షం పొందాలి. గురువుతోటి సంబంధం కంటే ఇనుపసంకెళ్ళు మెరుగు. ఇనుప సంకెళ్ళని మనం గొడ్డలిపెట్టి నరికేసుకుంటే పోతాయి. కానీ గురువుతోటి ఉన్న సంబంధాన్ని మనం గొడ్డలి పెట్టి నరకలేము. ఎందుచేతనంటే అవి సంకెళ్ళేకాని మన కళ్ళకి కనపడవు. కళ్ళకి కనపడకపోతే వాటిని ఎలా ఛేదిస్తాము. అందుచేత గురువు దయ కనుక మీకు ఉంటే అంతా ఉన్నట్టే. గురువు దయలేకపోతే అన్నీ ఉన్నా ఏమీ

లేనట్టే. ఒకోసారి మీకు కష్టాలు వస్తే మీ బంధువులు విడిచిపెట్టేయవచ్చు, మీ స్నేహితులు విడిచిపెట్టేయవచ్చు కానీ ఎట్టిపరిస్థితులలోను మీ గురువు మిమ్మల్ని విడిచిపెట్టడు. ఈ శరీరం పోయినప్పడు మనకి బంధువులతోటి, స్నేహితులతోటి, ఆస్తులతోటి అందరితోటి సంబంధాలు తెగిపోతాయి. కానీ గురువు మనకి ఆత్మానుభవం కలుగజేసేవరకూ ప్రతీ జన్మలోను మనల్ని వెంటాడుతూ ఉంటాడు. బోయవాడు జంతువుని చంపటానికి ఎలా వెంటాడుతాడో అలాగ మన వ్యక్తిభావనని, మన అజ్ఞానాన్ని నిర్మూలించటానికి ఈ జన్మలో మనం ప్రిపేర్ అవ్వలేకపోతే వచ్చే జన్మలో అయినా మనల్ని వెంటాడి, వెంటాడి మనలో ఉన్న అజ్ఞానాన్ని తొలగించి తన స్వరూపాన్ని మనకి ఇచ్చే వరకూ గురువు మనలను విడిచిపెట్టడు. శరీరాలు మారిపోయినా గురువు మనలను వెంటాడుతూనే ఉంటాడు. వాడు గురువు. గురువు అనుగ్రహం మీరు ఎప్పడూ రుచి చూడలేదు. ఆ అనుగ్రహం మీరు రుచి చూస్తే తెలుస్తుంది. ఆ అనుగ్రహం ఎలా ఉంటుంది అంటే ఏదో దూరంగా ఉన్న వస్తువుని చూచినట్టుకాదు. ఈ చెయ్యి, ఆ చెయ్యిని ముట్టుకుంటే ఆ స్పర్శ మీకు ఎంత స్పష్టంగా తెలుస్తుందో అలాగ గురువు దయ మీ హృదయంలో మెదిలినప్పడు అంత స్పష్టంగా మీకు భౌతికంగా అది తెలుస్తుంది. మీ హృదయంలో ఉన్న సద్వస్తువే గురురూపం ధరించి బయట తిరుగుతూ ఉంటుంది. ఎందుచేతనంటే మీ మనస్సుని పవిత్రం చేసి, మీ మనస్సుని ఏకాగ్రపరచి మిమ్మల్ని లోపలకి నెట్టటంకోసం రూపం ధరించి వస్తాడు. నా మనస్సు కుదురుగా ఉండటం లేదు, నా మనస్సు శాంతిగా ఉండటంలేదు అని మీరు అనుకుంటూ ఉంటారు. మీరు తొందరపడకండి. మీ మనస్సులు ఎంత చలనంగా ఉన్నా అది గురువు అనుగ్రహం వలన నిశ్చలమయ్యే రోజు సమీపంలోకి వస్తోంది. ఎప్పడోకాదు, ఈ జన్మలోనే అది వస్తుంది. మీరు గురువుపట్ల విశ్వాసం వదిలిపెట్టకండి, నమ్మకం వదిలిపెట్టకండి. ఏ మనస్సు అయితే నిన్ను పీడిస్తోందో, ఏ మనస్సు అయితే నీకు బంధకారణమో, ఆ మనస్సుని శాంతపరచి, నిర్మలంచేసి తనలో ఐక్యం చేసుకుంటాడు. వాడు గురువు. ఇది నమ్మితే సొమ్ము, నమ్మకపోతే దుమ్ము.

నీకు ద్వేషం అనే దోషం లేదు అనుకో, రాగం అనే దోషం లేదు అనుకో, ఇంక నీ మనస్సు బాహ్యముఖం అవ్వటానికి అవసరం ఏముంది. మీ శరీరం ఇక్కడ ఉంది, మీ మనస్సు భీమవరం వెళ్ళవలసిన పని ఏమిటి? శరీరం ఉన్న చోట మనస్సు ఎందుకు ఉండటంలేదు? రాగం అనే దోషమో, ద్వేషం అనే దోషమో ఏదో ఒక దోషం నీలోపల

ఉంది చూచుకో. ఏ దోషం లేకపోతే నువ్వు బయటకు వెళ్ళవలసిన పని ఏమిటి? అందుచేత వాటి వేగం తగ్గించుకో. ఒకేసారి సడన్ బ్రేకు వేయకు. స్లోగా తగ్గించుకుంటూ, తగ్గించుకుంటూ నీ శరీరం శవం అయ్యేటప్పటికి జీరో చేసుకో ఇదీ సిద్ధాంతం. ఆచార్యులువారు ఏమన్నారు అంటే కక్కిన కూడు కోసం ఎవడూ ఆశపడడు. అలాగే మీరు స్వచ్ఛందంగా విడిచిపెట్టేసిన భోగాలను మళ్ళీ కోరుకుంటూ ఉంటే మీ నోటితో కక్కిన కూడు మళ్ళీ మీరు ఆశించినట్టే అన్నారు. నువ్వు శరీరం అనుకోవటం వలన గురువుని కూడా శరీరంగానే చూస్తావు, కానీ గురువు ఒక రూపం ధరించి నీకు కనిపిస్తున్నప్పటికీ, గురువు బయట నుంచి చేసేది తక్కువే, లోపలినుంచి ఎక్కువ చేస్తాడు. గురువు నీతో మాట్లాడుతూ ఉంటాడు, వాడు చేసేపని అంతా లోపల ఉంటుంది. మీ మనస్సులో ఉన్న బలహీనతలు ఏమిటో మీకు చూపిస్తాడు. నువ్వు ఎక్కడ దారి తప్పిపోతున్నావో చూస్తాడు. ఏ కారణాల వల్ల మనస్సు బాహ్యముఖం అవుతుందో చూస్తాడు. నీకు పునర్జన్మలకి కారణాలు ఏమి ఉన్నాయో లోపల చూస్తాడు. ఆ కారణాలు ఏమిటో నీకు చూపించి, నెమ్మదిగా ఒకోటి ఒకోటి బయటకి లాగి కాల్చి బూడిద చేసేవరకూ గురువు నిన్ను విడిచిపెట్టడు. వాడు గురువు. రామకృష్ణ పరమహంస మహేంద్రనాథగుప్తాతో అంటాడు నీ సంసారం చూస్తే పెద్ద సంసారం. నిన్ను నా హాస్పటల్‌లో చేర్చేసుకున్నాను, ఇప్పుడు నువ్వు చావటానికి సిద్ధంగా ఉన్నావు. నిన్ను హాస్పటల్ నుంచి ఇప్పుడు ఎలా బయటకు పంపుతాను. చచ్చిపోతే మా హాస్పటల్‌లోనే చచ్చిపోదువుగాని, నిన్ను రోడ్డు మీద విడిచిపెట్టను. నువ్వు బాగుపడే వరకూ ట్రీట్‌మెంట్ ఇస్తూనే ఉంటాను అన్నాడు రామకృష్ణుడు. నీకు గొప్ప శక్తులు ఉండవచ్చు, గొప్ప చదువులు ఉండవచ్చు, నీకు ధనం ఉండవచ్చు, దూరం విషయాలు కూడా నువ్వు దర్శించగల శక్తి ఉండవచ్చు ఇవన్నీ ఉన్నప్పటికీ ఏదీ గురువు యొక్క అనుగ్రహంతో సమానంకాదు. ఇది ఫైనల్. నీ హృదయంలో ఉన్న నిజాన్ని చూపించేది గురువు అనుగ్రహం ఒక్కటే.

గురువు దయ ఎలా ఉంటుందో చెప్పమని ఒకరు భగవాన్‌ని అడిగారు. అది మాటలకి, ఊహలకి, సంకల్పానికి అతీతం. బుద్ధితోటి ఆలోచించి చెబుదామంటే ఆ దయ బుద్ధికి అతీతం. మనస్సుకి, ఇంద్రియాలకి ఆ దయ అతీతం. గురువు అనుగ్రహం ఉంది. అది మాటలకు అందదు, అందని దాని గురించి నన్ను ఎలా చెప్పమంటావు. అది అనుభవైకవేద్యం. నీ హృదయంలో చైతన్యం మేల్కొన్నప్పుడు గురువు అనుగ్రహం వలన కదా ఈ చైతన్యం నాలో మేల్కొంది, గురువు అనుగ్రహం ఇట్టిదని నీ అనుభవానికి

అందుతుంది అన్నారు. నువ్వు ఎన్ని సాధనలు చేసినా, ఎన్ని యాత్రలు చేసినా, అంతిమంగా ఆ చివరిస్థితిని, పరమస్థితిని నువ్వు చేరుకోవాలి అంటే అది ఈశ్వరుని యొక్క, గురువు యొక్క అనుగ్రహం లేకుండా నీకు సాధ్యము కాదు. ఎవ్వరికీ లేని కష్టాలు నాకు వస్తున్నాయి ఏమిటి? నాకు ఇంత దుఃఖం ఉంది ఏమిటి? అని ఇలా అనుకోకండి. మీకు సబ్జక్టు బాగా అర్థం అవుతూ ఉంటే, మీ అశాంతి అంతా శాంతిగా మారిపోతుంది. మీ దుఃఖం అంతా సుఖంగా మారిపోతుంది. మీ అప్పులు అన్నీ నిలవకింద మారిపోతాయి. వాల్మీకి రామాయణంలో ఒక మాట చెబుతాడు. రాముడిని మీరు చూడటంకాదు, రాముడిచేత మీరు చూడబడాలి అని. మన నేత్రాలు మాంసంతోటి తయారు చేసారు. రాముడి నేత్రాలు జ్ఞాననేత్రాలు. అందుచేత జ్ఞాననేత్రాలతోటి చూడబడాలి. ఇది పులినోట్లోపడ్డ మాంసపు ముక్క. అంటే ఈశ్వరుని యొక్క చూపు ఒక్కసారి నీమీద పడితే నువ్వు తరించేవరకూ ఆ దయ నిన్ను వెంటాడుతూ ఉంటుంది. ఎంత పెద్ద గడ్డిమేటు అయినా ఒక అగ్గిపుల్లకి లోకువ. అలాగే కొన్ని కోట్లాది జన్మలకి సంబంధించిన అజ్ఞానం నీ లోపల ఉన్నా, ఇంత అజ్ఞానం ఉంది ఏమిటి అని గురువు అనుకోడు. గురువు యొక్క జ్ఞాన నేత్రానికి ఇది అంతా లోకువే. మన గొప్పల కోసం కాకుండా, మన వ్యక్తీభావన కోసం కాకుండా, రాముడి అనుగ్రహం కోసం, రాముడి దయకోసమే మనం పని చేస్తూ ఉంటే చివరికి ఆ రాముడు మిగులుతాడు, మనం పోతాము. అది చివరిస్థితి, పరమస్థితి.

మీరు కష్టంలో ఉన్నప్పుడు ఎవరైనా మీకు మాట సహాయం చేసినా లేకపోతే ద్రవ్య సహాయం చేసినా, మీరు భయపడుతూ ఉంటే మేము ఉన్నాము అని అభయస్థితి ఇచ్చినా, ఎవరు ఏ రూపంలో మీకు సహాయసహకారములు అందించినా వాళ్ళపట్ల మీరు కృతజ్ఞత విడిచిపెట్టకండి. మనకి దేహము లోపల నేను అనే తలంపు ఉంది. ఈ దేహము లోపల నేను అనే తలంపు ఎవడైతే పెట్టాడో వాడి దయ లేకుండా ఆ నేను బయటకు వెళ్ళదు. నీ కుయుక్తులకి, నీ కుతంత్రాలకి, నీ జిమ్మిక్కులకి ఆ నేను బయటకు వెళ్ళదు. ఆ నేను అనే తలంపు కోసమే చుట్టరికాలు, స్నేహాలు, విరోధాలు, గొప్పలు ఆ నేను అనే తలంపుని ముస్తాబు చేయటానికే కదా గొప్పలు. మీరు చాలా గొప్పవారు అంటే ఎవరు సంతోషిస్తున్నారు. సంతోషించేది మీ శరీరం కాదు, ఆ శరీరం లోపల ఉన్న నేను అనే తలంపు. ఈశ్వరానుగ్రహం లేకుండా ఆ నేను బయటకు వెళ్ళదు. అందుచేత ఈశ్వరానుగ్రహం పొందటానికి నిరంతరం ప్రయత్నం చేయండి.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు

| | | |
|---|---|---|
| ఆగస్టు | 21 | కృష్ణాష్టమి, జిన్నూరు శ్రీ రమణ క్షేత్రం |
| సెప్టెంబరు | 1 | ఐ-భీమవరం |

With malice to none, Charity even unasked, and help to all creatures in thought, word and deeds, is the pious nature of good men, always.

- Mahabharatha



**భూపతిరాజు శ్రీరామమూర్తి రాజుగారు వారి షష్టిపూర్తి సందర్భముగా సద్గురు శ్రీ నాన్నగారితో...**

# దైవ నిర్ణయంపై నిరీక్ష నేర్చుకొంటే - శరణాగతి సిద్ధిస్తుంది

జన్మజన్మల నుంచి మనం కర్తగా భావిస్తున్నాము ప్రతీ పనికి ఈ భావనే బంధకారణమౌతున్నది. దీని వల్లనే పదే పదే పుట్టవలసిన పరిస్థితి వస్తున్నది. ఈ దేహబుద్ధిని జయించాలి. తనుసాక్షిణి అనుకొంటే కళ్యాణపథం ప్రాప్తిస్తుంది. ముందు నాగతి ఏమిటి? అని ఎందుకు ఏడవటం. ఏ సందర్భంలోనూ దైవ నిర్ణయం పై వైఫల్యము పొందకూడదు. సర్వత్రా, సర్వకాలాల్లోనూ మన తండ్రియైన గురుదేవులు తప్ప మనకు ఎవరు ఉన్నారు? ఒకవేళ ఆయన శిక్షించినా మన మేలు కొరకే. మనం ఆయన సంకల్పానికి అనుగుణంగా నడిస్తే మనలను ఎందుకు శిక్షిస్తారు. రంతిదేవుడు "ఏ ప్రారబ్దం అనుభవించటానికి ఈ దేహం వచ్చిందో ఆ ప్రారబ్దమే ఈ శరీరాన్ని పోషిస్తుంది" అన్నారు. అది శరణాగతి. భగవాన్ "దైవ శక్తిని గురించి ఊరికే ఉండు ప్రతీ ఒక్కరినీ దైవమే చూచుకొంటాడు. ఎన్నో కోట్ల జనులలో నీవు ఒక్కడివి. అందరినీ చూచే ఆయన నిన్ను చూడడా? ఆయన ఇచ్ఛపై అన్నీ వదిలేయటం మంచిది. ఏపాటి తెలివి ఉన్నా దీన్ని గ్రహించవచ్చు" అన్నారు. భగవంతుడు సత్యం, భగవన్‌నిమగ్నమైన జీవితం అశుభాన్ని పొందదు. శ్రీనాన్నగారు "మీరు అనుకొన్నా అనుకోకపోయినా మీ ఇష్టాఅయిష్టాలతో సంబంధం లేకుండా అంతా ఈశ్వర ప్రణాళిక అనుసరించి జరుగుతున్నది. మీ ప్రణాళిక జరుగదు. ఆయన జీవులను ఎప్పుడు, ఎక్కడ కలుపుతాడో ఎక్కడ విడదీస్తాడో ఆయనకే తెలుసు. శరణాగతి వల్ల మీలో కంట్రోల్ వస్తుంది. సాధన చెయ్యకుండానే మనస్సు వశమౌతుంది తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభం" అన్నారు. మనం పరమాత్ముని చేతుల్లో కీలు బొమ్మలము. మనం పుట్టించటానికి ముందే మన కర్మలు అన్నీ నిర్ణయించాడు. దాన్ని గురించి చింతించకూడదు. బలహీనత తప్ప మరో పాపం లేదు. ఇది అజ్ఞానం నుంచి వస్తుంది. "ఏది నిజమైనదో అది ఎప్పుడో ఒకప్పుడు ఋజువు చేసుకొంటుంది" అనే నిరీక్షణ నేర్చుకోవాలి. శరణాగతికి మించిన ప్రార్థన మరొకటి లేదు. భగవంతుని పాదాలమీద భక్తి కలిగితే అవగాహనను ఆయనే ఇస్తాడు. ఆత్మశక్తితో నిరీక్షణ నేర్చుకొంటే అజ్ఞానం సిగ్గుపడిపారిపోతుంది. మనం భగవంతుణ్ణి ఇలా ప్రార్థించాలి "ధనంపైన, కామంపైన ఆశక్తిలేదు. నా పూర్వ జన్మల కర్మానుభవాన్నిబట్టి అది అలా జరుగుతుంది. జన్మజన్మలకు నీ పాదాలమీద భక్తి ఉండేలా చూడు నేను ప్రార్థిస్తాను కాని సహాయం నీవే చెయ్యాలి" అని వేదనతో అర్పణభావంతో కన్నీటితో నివేదించుకొంటేచాలు మిగిలిన పని దైవం చూచుకొంటాడు. నిజధామానికి చేరిపోతాము.

**- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్ధవరం**